
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



విజయనగరం
జిల్లా వార్తలు
శుక్రవారం 21 నవంబరు 2025

విజయనగరం రైల్వేస్టేషన్‌లో అత్యవసర చికిత్స కేంద్రం

విజయనగరం దాసన్నపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం నెంబరు 2, 3లో అత్యవసర చికిత్స కేంద్రాన్ని గురువారం డీఆర్‌ఎం లలిత్ బోహ్రా ప్రారంభించారు. మిమ్స్ ఆసుపత్రి యాజమాన్యం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైల్వే ప్రయాణీకులకు అత్యవసర పరిస్థితుల్లో చికిత్స అందించేందుకు మిమ్స్ యాజమాన్యం ఈ ఏర్పాట్లు చేసిందన్నారు. 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వైద్యులు, సిబ్బంది ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ముంజేరు రణరంగం





ముంజేరులో ఇరువర్గాలు కొట్టాడుకుంటున్న దృశ్యం, (ఇన్‌సెట్‌లో) ఓ మహిళను మెడ పట్టి లాక్కెళ్తున్న మరో మహిళ

ముంజేరులోని సిద్దార్థ కాలనీ గురువారం రణరంగమైంది. మురుగు కాలువ నిర్మాణ విషయమై మొదలైన గొడవ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రెండువర్గాల వారు బాహాబాహీకి దిగారు. కారం, రాళ్లు విసురుకున్నారు. ఆ రాళ్లు పక్కనే ఉన్న పాఠశాల పిల్లల మధ్యాహ్న భోజనంలో పడి ఆహారం పాడైంది. కొట్లాటను చూసిన పిల్లలు భయపడిపోయారు. ఏం జరుగుతుందోనని స్థానికులూ కలవరపడ్డారు. పోలీసులు వచ్చినప్పటికీ చాలా సేపటి వరకు పరిస్థితి అదుపులోకి రాలేదు. విషయం తెలిసి గ్రామానికి చేరుకున్న డీఎస్పీ గోవిందరావు ఘటనపై ఆరా తీశారు. అనంతరం సిద్దార్థకాలనీ వాసులు ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించారు.

- మురుగుకాలువ నిర్మాణంపై మొదలైన గొడవ
- రెండు వర్గాల బాహాబాహీ
- కారం జల్లి, రాళ్లు రువ్వుకున్న వైనం
- రాళ్లు పడి పాడైన పిల్లల మధ్యాహ్న భోజనం
- విచారించిన డీఎస్పీ గోవిందరావు
- ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించిన సిద్దార్థకాలనీ వాసులు



కాలువ తవ్వకాన్ని అడ్డుకుంటున్న మహిళలు

భోగాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ముంజేరు గ్రామంలో సిద్దార్థకాలనీ వాసులకు, మిగతా నివాసాలకు మధ్య మురుగుకాలువ సమస్య కొన్ని సంవత్సరాలుగా నడుస్తోంది. కాలనీ మీదుగా మురుగు కాలువ నిర్మాణానికి ఎట్టి పరిస్థితిలో అంగీకరించబోమని వారు పట్టుబట్టగా తవ్వి తీరుతామని ముంజేరు గ్రామస్థులు ప్రకటిస్తూ వస్తున్నారు. దీంతో అనేక సార్లు గొడవలు జరిగాయి. ఊరి ప్రజల వాడుక నీరంతా తమ ప్రాంతం మీదుగా వెళ్తే ఇబ్బంది పడతామనేది కాలనీవాసుల మాట. ఈ నేపథ్యంలోనే కాలువ సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై సిద్దార్థ కాలనీ వాసులు న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించారు. అయితే ఇటీవల మురుగు కాలువ నిర్మాణానికి పంచాయతీ తీర్మానం చేయడంతో కాంట్రాక్టర్ బంకపల్లి నూకాలమ్మ ఈనెల 18న కాలువ నిర్మాణానికి ప్రయత్నించారు. ఆ సమయంలో సిద్దార్థకాలనీ వాసులు అడ్డుకున్నారు. మరోసారి గురువారం ముంజేరు గ్రామస్థులందరూ కలిసి ఎలాగైనా కాలువను తవ్వి తీరుతామని పట్టుబట్టి ఎక్సకవేటర్‌తో పనులు ప్రారంభించారు. విషయం తెలిసి సిద్దార్థకాలనీకి చెందిన మహిళలు కాలువ తవ్వకుండా అడ్డంగా బైఠాయించారు. అదే సమయంలో ముంజేరు గ్రామానికి చెందిన మహిళలు వారిని నెట్టడానికి (మిగతా 8వ పేజీలో..)

శిథిల భవనంలో హాస్టల్

- అవస్థలు పడుతున్న విద్యార్థినులు
- ఏళ్లుగా పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరుకున్న కళాశాల వసతిగృహం

విజయనగరం టౌన్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఆ వసతిగృహానికి ప్రభుత్వం నెలకు రూ.17 వేలు అద్దె చెల్లిస్తోంది. అంటే ఎంతో సౌకర్యంగా ఉంటుందనుకుంటున్నారు కదూ! సౌకర్యం తర్వాత భవనం పైకప్పు కూలకపోతే చాలని అక్కడి విద్యార్థినులు ఆవేదనతో చెప్పారు. స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విజయనగరంలోని మహారాణిపేటలో నిర్వహిస్తున్న కళాశాల బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరింది. భవనంలో ఎటు చూసినా గోడలు బీటలువారి ప్రమాదకరంగా మారింది. ఎన్నో ఏళ్లుగా అద్దెకొంపలో నిర్వహిస్తున్న ఈ వసతిగృహంలో 30మంది బాలికలు ఉండేవారు. ప్రస్తుతం 18మంది వసతి పొందుతున్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. తగినన్ని బెడ్‌లు లేవు. సిబ్బంది సరిగా వసతిగృహంలో ఉండటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా వరకు సీనియర్ విద్యార్థినులే నిర్వహణ చూస్తుంటారు. అక్కడ వసతి పొందుతున్న వారంతా ఇంటర్ విద్యార్థినులే. సూపరింటెండెంట్ లేరు. కుక్, వాచ్‌ఉమెన్, అటెండర్‌ను కూడా భర్తీ (మిగతా 8వ పేజీలో..)

బోగస్ ఓట్లకు చెక్

- ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియలో అధికారులు
- 2002 జాబితాకు 2025 జాబితా మ్యాపింగ్
- ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్న బీఎల్‌వోలు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ జరుగుతోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2002 సంవత్సరంలో ఉన్న ఓటర్ల జాబితాకు 2025 జాబితాను మ్యాపింగ్ చేస్తున్నారు. దీనివల్ల బోగస్ ఓట్లు ఉండవని, ఎంత మంది పెరిగారో సమగ్రంగా తెలుస్తుందని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. బూత్ లెవల్ అధికారులు ప్రత్యేక యాప్‌లో ఈ ప్రక్రియను చేపడుతున్నారు. దీనిపై ఇప్పటికే బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. బీఎల్‌వోలకు 2002 నాటి ఓటర్ల జాబితా, 2025 ఓటర్ల జాబితాను కూడా అందజేశారు. ఈ రెండు సరిచూసుకుని యాప్‌లో మ్యాపింగ్ చేస్తున్నారు. 2002 సంవత్సరంలో స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ జరిగింది. ఆ తరువాత నుంచి ఇంత వరకూ ఎస్ఎస్ఆర్ (స్పెషల్ సమరీ రివిజన్) మాత్రమే జరుగుతోంది. అంటే ప్రతి ఏడాది అక్టోబరు నెలలో ఎస్ఎస్ఆర్‌కు షెడ్యూల్ ఇవ్వడం తరువాత కొత్త ఓటర్లను నమోదు చేయడం జరుగుతోంది. తుది (మిగతా 8వ పేజీలో..)



జిల్లా ఎన్నికల కార్యాలయం

ఇతర వర్గాలతో సమానంగా ఎదగాలి

- ఎస్సీలకు సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా అందాలి
- ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్



మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇతర వర్గాలతో పాటు ఎస్సీలు కూడా సమానంగా ఎదగేలా చూడాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ అధికారులకు సూచించారు. ఎస్సీల పట్ల సానుభూతి కాకుండా వారి బాధలను మనస్ఫూర్తిగా అర్థం చేసుకుని సహానుభూతి చూపించాలన్నారు. గురువారం జిల్లాకు వచ్చిన ఆయనకు కలెక్టరేట్ వద్ద అధికారులు స్వాగతం పలికారు. అంతకుముందు జడ్పీ సమావేశ అతిథిగృహంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 45 మంది విన్నపాలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ రామసుందర్ రెడ్డి, ఎస్పీ దామోదర్‌తో కలిసి కలెక్టరు చాంబర్‌లో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ జవహర్ మాట్లాడుతూ సంగీత సాహిత్యాలకు నిలయమైన విజయనగరం జిల్లాపై తనకు ప్రత్యేక అభిమానం ఉందని అన్నారు. జనాభాలో 15 శాతం ఉన్న ఎస్సీలకు భరోసా కల్పించాలని, వారికి సామాజిక న్యాయంతో పాటు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. అట్రాసిటీ కేసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ ప్రాంతంలో ఎస్సీల పట్ల వివక్షత కొనసాగుతుండటం బాధాకరమన్నారు. ఈ పరిస్థితి మారేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, వారికి విద్య, వైద్యం అందేలా చూడాలని చెప్పారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో కూడా ఎస్సీలకు రిజర్వేషన్ (మిగతా 8వ పేజీలో..)

ఎస్.కోటలో నేడు విశాఖ ఎంపీ పర్యటన

శృంగవరపుకోట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట నియోజకవర్గంలో శుక్రవారం విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ పర్యటించనున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. ఉదయం 9గంటలకు లక్కవరపుకోట మండలం రంగరాయపురంలో అంగన్‌వాడీ భవనం ప్రారంభం, 10గంటలకు ఎస్.కోట మండలం శివరామరాజుపేట గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 10.30 గంటలకు, మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన ఉంటుంది. 10.45 గంటలకు తలారి పంచాయతీ శివారు ఉసరి గ్రామ కల్వర్ట్ ప్రారంభోత్సవం, ఉదయం 11.45 గంటలకు వేపాడ మండలం ముకుందపురం బ్రిడ్జి ప్రారంభం, 12.15 గంటలకు కరకవలస గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు కొత్తవలస మండలం అర్థానపాలెం ప్రగతి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించనున్నారు.

కొత్తవలస తహసీల్దార్ సస్పెన్షన్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కొత్తవలస తహసీల్దార్ పి.అప్పలరాజును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రామసుందర్ రెడ్డి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తవలస మండలంలోని చిన్నపాలెం, కింతలపాలెం, కొత్తవలస గ్రామాల్లో భూములకు సంబంధించి మ్యుటేషన్లు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయంటూ కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. అలాగే పీజీఆర్ఎస్‌లో కూడా ఓ అర్జీదారుడు తహసీల్దార్‌పై ఫిర్యాదు చేశారు. దీనిపై కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ విచారించారు. ఈ మేరకే తహసీల్దార్ అప్పలరాజును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. అక్కడి డిప్యూటీ తహసీల్దార్ సునీతకు ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతలు అప్పగించారు.



మత్స్య సంపద ఆశాజనకం



సముద్రంలో వేటాడిన చేపలను అమ్మకానికి తీసుకెళ్తున్న మత్స్యకారులు

- జిల్లాలో ఏటా ఉత్పత్తి పెరుగుదల
- మత్స్యకారులకు జీవనాధారం
- నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్స్య సంపద ఉత్పత్తి పెరుగుతోంది. గతం కంటే ఇప్పుడు చేపలు వినియోగించే వారి సంఖ్య పెరగడంతో మత్స్యకారులకు ఉపాధి కూడా పెరిగింది. వాటి ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సహకారం అందిస్తున్నాయి. అనేక పథకాలు, సబ్సిడీలు అమలు చేస్తున్నాయి. సంప్రదాయ మత్స్యకారులతో పాటు సముద్రంలో వేట ప్రమాదకరమైనా ఆ వృత్తినే తరతరాలుగా వేలాది మంది మత్స్యకారులు అనుసరిస్తున్నారు. వారిని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతి ఏడాది నవంబరు 21న ప్రపంచ మత్స్య దినోత్సవం (మిగతా 8వ పేజీలో..)



జిల్లాలో ఐదు సంవత్సరాల్లో చేపల ఉత్పత్తి టన్నుల్లో ఇలా..

సంవత్సరం	ఇల్యాండ్	మెరైన్	మొత్తం
2020 -21	31202	12933	44135
2021- 22	27316	12408	39724
2022 -23	16799	9107	25906
2023 -24	11279	7452	18731
2024 -25	11861	8032	19893

నేడు పోలిపాడ్యమి

- సముద్ర, నదుల్లో పుణ్యస్నానాలు
- నేటితో ముగియనున్న కార్తీక మాసం

విజయనగరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో పోలి పాడ్యమి పురస్కరించుకుని శుక్రవారం సముద్ర, నదుల్లో ప్రత్యేక స్నానాలకోసం ఏర్పాట్లుచేస్తున్నారు. భక్తులు స్నానమాచరించి అరటి దవ్వల్లో దీపాలను వదలనున్నారు. గతనెల 21న ప్రారంభమైన కార్తీకమాసం పోలి పాడ్యమితో ముగియనుంది.

ప్రాశస్త్యం ఇది..

వ్యాస మహర్షి రచించిన స్కంద పురాణం ప్రకారం కార్తీకమాసం చివరి రోజైన అమావాస్య తర్వాత రోజునే పోలిపాడ్యమిని జరుపుకొంటారు. కార్తీక మాసంలో శివ-కేశవలను ఆరాధిస్తే, సకల శుభాలు కలుగుతాయన్నది భక్తుల నమ్మకం. పాడ్యమినాడు నిర్వహించే పోలిపాడ్యమిని పోలి స్వర్గమని అంటారు. ఈ రోజున దీపాధారణ చేయడం, నదులు, చెరువుల్లో, సముద్రంలో దీపాలను వదలడం వంటివి చేస్తారు. ఈ రోజే పోలి బొందితే స్వర్గానికి వెళ్లిన రోజని స్కందపురాణం చెబుతోంది.

పోలి స్వర్గం

ఓ రజక స్త్రీకి నలుగురు కొడుకులు, కోడళ్లు ఉన్నారు. ఆమె కార్తీక బహుళ అమవాస్య నుంచి ఆ నెలంతా ముగ్గురు కోడళ్ల తోడుగా నది స్నానానికి వెళ్లి దీపం పెట్టి వస్తుండేది. చిన్న కోడలే ఇంటి చాకిరి చేస్తుండేది. ఆమెకు పనులను అప్పగించి ముగ్గురు కోడళ్లతో ఆలయానికి వెళ్లి అత్త పూజలు చేస్తూ వచ్చేది. చిన్న కోడలు పోలికి నది స్నానం చేయాలన్న కోరిక ఉన్నా, పంపించేవారు కాదు. అయితే చిన్న కోడలు పోలి ఏ విధంగా నైనా దీపం పెట్టాలనుకుంది. వెన్న చిలికిన కవ్వానికి అంటుకున్న వెన్నను తీసి పెరటిలో మొలిచిన పత్తి కాడను తీసుకుని ఒత్తిగా చేసింది. బావి వద్ద స్నానం చేసి, దీపారాధన చేసింది. కైలాసం నుంచి చూసిన దేవదూతలు పోలీ కోసం విమానాన్ని తీసుకువచ్చారు. పోలి ఆ విమానాన్ని ఎక్కి బొందితో స్వర్గానికి వెళ్లిందని పురాణాలు చెబుతున్నాయి. ఇంత ప్రాశస్త్యం ఉన్న కథను చదవి సముద్ర, నది స్నానాలు ఆచరించి, భక్తితో శివయ్యను ఆరాధిస్తే, సకల పాపాలు, దోషాలు పోయి శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.





శివాలయం వీధిలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం

వంతెన లేక.. వానాకాలంలో పాట్లు

- దశాబ్దాల కల నెరవేరని వైనం
- చింతలగెడ్డ పొంగితే పది గ్రామాల ప్రజలకు తప్పని అవస్థలు

రాజాం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల ంలోని కంచరాం-కొత్త కంచరాం గ్రామాల మధ్య రుద్రసాగరం(చింతలగెడ్డ) గెడ్డపై వంతెన కలగా మారింది. ఇక్కడ వంతెన లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో పది గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. దశాబ్దాలుగా వంతెన నిర్మాణం కల నెరవేరని పరిస్థితి నెలకొంది. సాధారణ రోజుల్లో పెద్దగా ఇబ్బందులు లేకపోయినా వర్షాకాలం, తుఫాన్ వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సమయంలో చింతలగెడ్డ పొంగితే పది గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక్కడ వంతెన నిర్మించాలని దశాబ్దకాలంగా పది గ్రామాల ప్రజలు కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారని పలువురు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి

జిల్లాలోని తెర్లాం తదితర ప్రాంతాల్లోని మిగులు జలాలు వర్షాకాలంలో పొంగిప్రవహిస్తుంటాయి. ఇక్కడ గొలుసుకట్టు విధానంలోని చెరువులను నింపే క్రమంలో రుద్రసాగరం, సారధిగెడ్డ విడిపోయి ప్రవహిస్తుంటాయి. సారధిగెడ్డ బీఎస్‌వలస, ఎంజేవలస, మారేడుబాక, కొత్తవలస, రాజాం, సారధి, అంతకాపల్లి, శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, సంతకవిటి మండలం మీదుగా పొందూరు మండలంలోని రెల్లిగెడ్డలో కలుస్తోంది. రుద్రసాగరంగా పిలవబడే చింతలగెడ్డ కంచరాం- కొత్త కంచరాం మధ్య నుంచి రేగిడి మండలంలోకి ప్రవహిస్తోంది. గతంలో బీటీ రహదారి నిర్మాణం సమయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గెడ్డపై వంతెనకు బదులు కాజ్‌వే నిర్మించి చేతులు దులుపుకొంది. దీంతో వర్షాకాలంలో చింతగెడ్డ పొంగి కాజ్‌వే పైనుంచి నీరు ప్రవహిస్తోంది.ఈ పరిస్థితుల్లో ఆగూరు, రామినాయుడువలస, దోసరి, అమరాం, కొత్త అమరాంతో పాటు బలిజిపేట మండలంలోని ఉద్దవోలు, సుందరాడ తదితర ప్రాంతాల నుంచి రాజాం వచ్చిపోయే వారి రాకపోకలు గెడ్డపొంగితే నిలిచిపోతున్నాయి. గత ఏడాది సెప్టెంబరు, ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ వల్ల కురిసిన వర్షాలకు గెడ్డలో వరద ఉధృతికి పది గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలకు గురయ్యారు. దీంతో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక అధికారులు రంగంలోకి దిగాల్సివచ్చిన విషయం విదితమే. కాగా కంచరాం-కొత్త కంచరాం గ్రామాల మధ్య చింతలగెడ్డపై కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మించాలని కంచరాం, ఆగూరు, దోసరి, రామినాయుడువలస, అమరాం, కొత్త అమరాం, గడిముడిదాం, ఉద్దవోలు, సుందరాడ తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లామని టీడీపీ నాయకులు తెలిపారు.



చింతలగెడ్డ పొంగిపొర్లుతున్న దృశ్యం (ఫైల్)

తూడెంలో సాగర్ కవచ్

- మాక్‌డ్రిల్ నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకొన్న పోలీసులు

భోగాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూడెం సమీపంలో గురువారం పోలీసులు సాగర్‌కవచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాక్‌డ్రిల్ నిర్వహించి, బాంబులతో ఇద్దరు వ్యక్తులను పట్టుకొన్నట్లు సీఐలు కె.దుర్గాప్రసాదురావు, బీవీకే రాజులు తెలిపారు. సముద్రం నుంచి తీవ్రవాదులు చొరబడితే ఏ విధంగా పట్టుకోవాలో అన్న విషయంపై గురు, శుక్రవారాలు సాగర్ కవచ్ నిర్వహిస్తున్నారు. రెడ్‌పోర్స్ (కోస్టుగార్డ్సు) రహస్యంగా సముద్రం నుంచి సమీపంలోని గ్రామాల్లో చొరబడితే వారిని బ్లూఫోర్స్(మెరైన్, సివిల్ పోలీసులు)పట్టుకొనే విధంగా సాగర్‌కవచ్ చేపట్టారు. అయితే పోలీసుల నిఘా ఏ విధంగా ఉందో తెలుసుకోవడానికి డమ్మీ బాంబులతో ఐదుగురిని పంపించారు. వీరు భీమిలి మండలంలోని అవనాం మీదుగా తూడెం వైపు వస్తుండగా స్థానిక పోలీసులు వారిలో ఇద్దరిని అదుపులోకి తీసుకొని డమ్మీ బాంబులు స్వాధీనం చేసుకొన్నారు. అయితే వారిలో ముగ్గురు తప్పించుకోవడంతో సాగర్ కవచ్‌లో భాగంగా వారికోసం గాలిస్తున్నారు.



డమ్మీ బాంబులను పరిశీలిస్తున్న పోలీసులు

షటిల్ బ్యాడ్మింటన్‌కు ఉపాధ్యాయిని

కురుపాం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): లంకాజోడు గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన సోషల్ అసిస్టెంట్ రవ్వల గౌరీకుమారి జాతీయ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 19 నుంచి విజయవాడలోని డీఆర్‌ఎంసీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులు పోటీలకు ఆమె 50 సంవత్సరాల విభాగంగాలో ఆమె పాల్గొన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు లంకాజోడు పాఠశాల నుంచి ఇద్దరు మహిళా ఉపాధ్యాయులు గౌరీకుమారి, లక్ష్మి పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో గౌరీకుమారి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గౌరీకుమారి ఎంపిక కావడంపై లంకాజోడు పాఠశాల హెచ్‌ఎం ఎ.అరుణశ్రీ, సంక్షేమాధికారి టి.రేవతి అభినందనలు తెలిపారు.



రవ్వల గౌరీకుమారి

ముమ్మరంగా వాహన తనిఖీలు

కురుపాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మావో కీలక నేత హిడ్మా మృతి చెందిన నేపథ్యంలో గురువారం ఏజెన్సీలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ ప్రాంతంలో ఎక్కడ ఎటువంటి అవంచనీయ సంఘటన జరగకుండా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. అలాగే గురువారం జరిగిన వారపు సంతలో డ్రోన్ ద్వారా పరిశీలించారు. తనిఖీల్లో కురుపాం ఎస్‌ఐ నారాయణరావు, ట్రైనీ ఎస్‌ఐలు సాయికుమార్, కిరీటీ, సత్తిబాబు పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వక్తలు తెలిపారు. గురువారం శాఖా గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు పురస్కరించుకుని పలు పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.



శృంగవరపుకోట: విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

గుర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో ఎంఈవో భాను ప్రకాష్, కేవీ సూర్యనారాయణరాజు, కస్తూరిబా పాఠశాల ఎస్‌వో జానకి, ఎస్‌ఐ నారాయణరావు పాల్గొన్నారు.

● నెల్లిమర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జనాప్రసాద్ , డిప్యూటీ ఎంపీడీవో శంకర్ జగన్నాథ్, రిటైర్డ్ ఆర్‌ఎస్‌ఐ బోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

● శృంగవరపుకోట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శృంగవ రపుకోట శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సమావేశంలో సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, శాఖా గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్, ఉపాధ్యాయుడు కాశీ విశ్వనాథం, డి.సూర్యారావు పాల్గొన్నారు.

● చీపురుపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను వినియోగించుకున్న వారు భవిష్యత్‌లో క్రమశిక్షణ కలిగిన వ్యక్తులుగా తయారవుతారని ఎంపీడీవో ఐ.సురేష్ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు పురస్కరించుకుని బహుమతులు ప్రదానంచేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం. బూసినాయుడు, గ్రంథాలయాధికారి ఎం. ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: బహుమతి ప్రదానం నిర్వహిస్తున్న దృశ్యం



నెల్లిమర్ల: విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అన్నదాతలూ.. జాగ్రత్త

- రేపటి నుంచి 27 మధ్య తుఫాన్ వచ్చే అవకాశం
- పంటలు కాపాడుకోవాలని వ్యవసాయశాఖ సూచన
- రైతుల్లో ఆందోళన

లక్కవరపుకోట/ గంట్యాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను చేసిన నష్టాల నుంచి రైతులు కోలుకోకముందే మరో తుఫాను హెచ్చరిక కలవర పరుస్తోంది. ప్రస్తుతం శ్రీలంకలో ఏర్పడి.. తమిళనాడు వైపు వస్తున్న అల్పపీడనం వల్ల ఇప్పటికే రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు ఈ నెల 22 నుంచి మధ్య బంగాళా ఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని... అది కోస్తా జిల్లాలకు విస్తరించనుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జా టరీ చేసింది. దీంతో వ్యవ సాయ శాఖ అధికారులు రైతులను అప్రమ త్తం చేస్తున్నారు. ఇప్పటికే పొలం పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఈ నెల 22 నుంచి 27 వరకు కోస్తా జిల్లాలకు వర్షాలు వస్తాయనే హెచ్చరికలతో వారు ఆందోళన చెందుతున్నా రు. ఇప్పుడిప్పుడే వరికోతలు మొదలు పెట్టారు. కొంతమంది రైతులు పొలాల్లోనే కుప్పలు పెడుతున్నారు. జిల్లాలోని 8 వ్యవసాయ సబ్ డివిజన్‌లలో గల 27 మండలాల్లో సుమారు 5 లక్షల 77 వేల ఎకరాల్లో రైతులు వరిపంట వేసినట్లు వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటికే 5 లక్షల 25 వేల ఎకరాలకు ఈ క్రాప్ కూడా జరిగింది. నేటి వరకు 40 శాతం వరి పంట కోసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కొంతమంది రైతులు పొలాల్లోనే పంటను కుప్పలు వేస్తున్నారు. తుఫానుకు మరో మూడు రోజుల సమయం ఉన్నందున కోసిన పంటను సురక్షితంగా ఉంచుకోవాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. 'తుఫాను హెచ్చరిక ఉన్నందున ఈ నెల 22 నుంచి రైతులు కోతలు కోయవద్దు. కోసిన పంటను కుప్పలుగా వేయాలి. పచ్చిగా ఉంటే ఉప్పు ద్రావణం పిచికారీ చేసి కుప్పలు వేసుకోవాలని వ్యవసాయాశాఖ ఇన్‌చార్జ్ ఏడీ హరికృష్ణ తెలిపారు.



ఎల్.కోట: కోసిన పంటను కుప్పలు పెడుతున్న రైతులు



గంట్యాడ: నరవలో కోసిన వరిచేను

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా

భామిని, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందించాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ డిప్యూటీ సెక్రటరీ జాస్పిత్‌సింగ్ అధికారులకు సూచించారు. గురువారం ఆస్పిరేషన్ బ్లాక్‌గా ఎంపికైన మనుమకొండ ఆదర్శ గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. రైతులతో మాట్లాడి కేంద్ర, రాష్ట్ర పథకాల లబ్ధిదారుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం భామినిలో నిర్వహిస్తున్న భవిత కేంద్రం, బొడ్డగూడ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రాల నిర్వహణ తీరును ఐసీడీఎస్ పీవో శాంతి భవానీని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వసంతకుమారి, సర్పంచ్ ఎన్.కేశవ, అస్పిరేషన్ బ్లాక్ కో-ఆర్డినేటర్ మహేశ్, జీసీసీ రాష్ట్ర డైరెక్టర్ నిమ్మల నిబ్రం పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

గొల్లలవలసలో జవాన్ అంత్యక్రియలు



అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

మెరకముడిదాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లవలస గ్రామానికి చెందిన జవాన్ అడ్డూరి దుర్గాప్రసాద్ అంత్యక్రియలు గురువారం అధికార లాంఛనాలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన అడ్డూరి దుర్గాప్రసాద్ అసోం రైఫిల్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన దుర్మరణం పాలయ్యారు. ఆయన పార్థివదేహాన్ని గురువారం గ్రామానికి తీసుకొచ్చి, అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, ఇన్‌చార్జి ఆర్డీవో ప్రమీలా గాంధీ, ఎస్‌ఐ జె.లోకేష్‌కుమార్, నాయకులు తాడ్డి సన్యాసి నాయుడు, కోట్ల మోతీలాల్ నాయుడు, చల్లా శ్రీరామ్ పాల్గొన్నారు.

సెస్ వసూలు కాక.. సౌకర్యాలు లేక

● శాఖా గ్రంథాలయంలో అవసరమైన పుస్తకాలు అందుబాటులోలేని వైనం ● ఇదీ గజపతినగరం మండలంలో పరిస్థితి

గజపతినగరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీల నుంచి గ్రంథాలయ సెస్సు బకాయిలు వసూలు కాకపోవడంతో నిర్వహణ భారంగా మారుతోంది. ప్రధానంగా గ్రంథాలయాల్లో కనీస సౌక ర్యాలు కొరవడ్డాయి. పాఠకులకోసం తాగునీరు, మరుగుదొడ్లు వంటి వసతులు కూడా కల్పించని పరిస్థితినెలకొంది. ప్రస్తుతం కాంపిటేటివ్ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు సైతం అందుబాటులో లేదు. పాత పుస్తకాలతోనే నెట్టుకురావాల్సివస్తోంది.స్థానిక శాఖా గ్రంథాలయానికి నిత్యం 60 నుంచి 70 మంది పాఠకులు వస్తుంటారు. అయితే వారికి అవసరమైన పుస్తకాలు అందజేసేందుకు సెస్సు బకాయిలు పేరుకుపోతున్నాయి. నేపథ్యంలో దాతలు ఇచ్చిన పుస్తకాలతోనే నెట్టుకు రావల్సివస్తోంది. మండలంలోని 30 పంచాయతీ నుంచి ఇంటి పన్ను నుంచి ఎనిమిది శాతం గ్రంథాలయానికి సెస్ రూపంలో చెల్లించాలి. ఏటా ఇంటిపన్ను కట్టించుకుంటున్న అధికారులు సెస్ కట్టేందుకు సుముఖత చూపడంలేదు.2019 నుంచి 2025 వరకు సెస్సువసూలు పూర్తిస్థాయిలో జరగలేదు.2018-19 సంవత్సరంలో గజపతినగరం పంచాయతీనుంచి 60వేలు మాత్రమే సెస్‌రూపంలో వచ్చినట్లు గ్రంథాలయ అధికారులు చెబుతున్నారు. 2019-20, 2024-25 వరకూ సెస్ వసూలు కాలేదని స్థానిక గ్రంథాలయ అధికారులు చెబుతున్నారు. కాగా పంచాయతీల నుంచి గ్రంథాలయానికి రావల్సిన సెస్ బకాయిలు పేరుకుపోయాని గ్రంథాలయశాఖ అధికారి స్వప్న తెలిపారు. పంచాయతీ అధికారులు సకాలంలో స్పందించి సెస్ చెల్లించాలని కోరారు.


గజపతినగరం శాఖా గంథాలయంలో చదువుతున్న పాఠకులు

ప్రతి రోజూ తాగునీరందిస్తాం

రాజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులకు ప్రతి రోజూ తాగునీరు పైప్‌లైన్ ద్వారా అందించేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ కె.రామ చంద్రరావు తెలిపారు. గురువారం ఆంధ్ర జ్యోతిలో తాగునీరు ఇవ్వలేరా శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో కలెక్టర్ స్పందించారు.తాగునీటి సరఫరాలో ఎందుకు ఇబ్బందులు కలుగుతున్నాయని కమిషనర్‌ను ప్రశ్నించారు.దీంతో అన్ని వార్డులకు పైప్‌లైన్ ద్వారా ప్రతి రోజూ తాగునీరం దిస్తామని కమిషనర్ తెలిపారు. పైప్‌లైన్ మరమ్మతులకు గురైనా తక్షణమే పనులు చేయించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేడు ప్రజాదర్బార్

రాజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజాం అర్బన్, రూరల్, వంగర, సంతకవిటి, రేగిడి మండలాల నుంచి ప్రజలు సమస్యలు పరిష్కారానికి వినతి పత్రం అందజేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దత్తిరాజేరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గర్భాం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా మండలంలోని అన్నిగ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ బీరము ఒక ప్రకటనలో తెలిపారు.శుక్రవారంఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

24 వరకు డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

శృంగవరపుకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 24వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం హానర్స్, బీఏ ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లుతో వస్తే ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

గజపతినగరం,నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం శ్రామికులు ఈ-కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏపీవో కృష్ణవేణి తెలిపారు. గురువారం మండలంలోని పురిటిపెంట, గంగచోళ్లపెంటల్లో ఉపాధిహామీపథకం పనులను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించి ఈ-కేవైసీ నమోదు చేయనున్నట్లు తెలిపారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

రాజాం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికిచేరాలని,మత్తుపదార్థాలకు బానిసలు కావొద్దని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం రాజాం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళాభద్రత తదితర అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. సరదాగా ప్రారంభించి చివరికి అలవాటుగా మారి జీవితాలను నాశనం చేసే శక్తి మత్తుపదార్థాలకు ఉందని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

గొట్లాంలో 'రచ్చబండ'

బొండపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లాంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ వైఎస్ జగన్ పిలుపు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాలు సేకరణ జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, వైసీపీ మండలాధ్యక్షులు జగదీశ్వరరావు పాల్గొన్నారు.

● నెల్లిమర్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు కోరారు. సీతారామునిపేటలో ఇందుకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు.

భూకబ్జాలపై ఫిర్యాదు

నెల్లిమర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దళితులపై జరుగుతున్న దాడులు, భూకబ్జాలు, అక్రమ కేసులకు సంబంధించి ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు ఫిర్యాదు చేసినట్లు జైభీమ్‌రావు భారత పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కనిగిర శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతిని ధులు కనిగిరి చిన్న మాలచ్చి, జగ్గారావు పాల్గొన్నారు.

రైతులకు మేలు జరిగేలా పాలన: కిమిడి


గరివిడి: వరిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

గరివిడి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు జరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలిస్తున్నారని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తెలిపారు. గురువారం మండలంలోని కోడూరు పంచాయతీలో వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం పంపిణీ చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సారిపాక సురేష్‌కుమార్, ఎలకల వెంకునాయుడు, సత్తిరాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుచేసిన వెంటనే డబ్బుల జమ

గుర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ రాష్ట్రకార్యదర్శి కిమిడిరామ్‌మల్లిక్‌నాయుడు తెలిపారు. తెట్టంగి పీఏసీఎస్‌లో సొసైటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈసందర్భంగా రామ్‌మల్లిక్‌నాయుడు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జమచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఏవో తిరుపతిరావు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సన్యాసినాయుడు, జమ్ము సొసైటీ అధ్యక్షులు మహేశ్వరరావు, పిల్ల అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, కృష్ణ పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో సమస్యల పరిష్కారానికి చర్యలు: అదితి

విజయనగరం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంధుల పాఠశాలలో సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. గురువారం విజయ నగరంలోని ఫూల్‌బాగ్ కాలనీ మంగళవీధిలోని ప్రభుత్వ అంధుల పాఠశాలను పరిశీలించి, సదుపాయాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని సమస్యల పరిష్కారం కోసం ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు.అలాగే రాష్ట్ర ఎస్సీకమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌ను అదితిగజపతిరాజు గురువారం జడ్పీ అతిథిగృహంలో కలిశారు. నియోజకవర్గంలోని ఎస్సీలు, ఎస్టీ ప్రాంతాల్లో ఉన్న సమస్యలు ఆయనకు వివరించారు.


ప్రభుత్వ అంధుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి: లోకం

డెంకాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాలు కల్పనకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. గురువారం మండలంలోని బంటుపల్లిలో మన ప్రజలతో- మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జనార్దనరావు, సంఘం సురేష్, రవికుమార్, భవిరిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగమాధవి

ప్రజలకు సేవచేయండి: కోళ్ల


జామి: కార్యవర్గ ప్రమాణస్వీకారంలో పాల్గొన్న లలితకుమారి

జామి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): టీడీపీలో పదవులు అంటే అనుభవించడానికి కాదని, ప్రజల్లోకి వెళ్లి వారికి సేవచేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. గురువారం జామిలో టీడీపీ మండలాధ్యక్షుడిగా వర్రి రమణ,కార్యదర్శిగా లగుడు రమణమ్మలతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహకకార్యదర్శి రాంప్రసాద్, స్వామినాయుడు పాల్గొన్నారు.

సత్యసాయి బోధనలను ఆచరించాలి

కొత్తవలస, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా బోదనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని సాయి మందిరంలోసత్యసాయిబాబా జయంత్యుత్సవం పురస్కరించుకుని పూజలు చేశారు. అనంతరం ఆమె పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో పీవీ రత్నాజీ, కోళ్ల వెంకరటమణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: బంగార్రాజు

భోగాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాగవంశస్థుల సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. గురువారం మండలంలోని పోలిపల్లిలో బంగార్రాజును నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ కాళ్ల సత్యవతి కలిశారు. ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కౌన్సిలర్ కళావతి పాల్గొన్నారు.


బంగార్రాజుతో మాట్లాడుతున్న సత్యవతి

బాస్కెట్‌బాల్ పోటీలకు ముగ్గురి ఎంపిక

లక్కవరపుకోట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగుబూడి హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు జి.రవికుమార్ తెలిపారు. ఎంపికైన బిలపూడి కీర్తన, చుక్క హరిత, కె.జాషువాసుందర్ శుక్రవారం నుంచి నూజివీడులో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

నగర పంచాయతీ జనసేన అధ్యక్షుడిగా నాని

నెల్లిమర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షుడిగా రవ్వానాని, ఉపాధ్యక్షుడిగా జరజాపుపేటకు చెందిన ఎంఎం.నాయుడు, జనసేన యువత అధ్యక్షుడిగా రవికుమార్ నియమితులయ్యారు.ఈమేరకు ఎమ్మెల్యే లోకం నాగమాధవి నియామక ఉత్తర్వులు జారీచేశారు.

'అక్షరాంధ్ర' విజయవంతం చేయాలి

నెల్లిమర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):అక్షరాంధ్ర కార్యక్రమాన్ని మెప్మాలో స్వయం సహాయక సంఘాలకు చెందిన విద్యావంతులైన మహిళలు విజయవంతం చేయాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని కోరారు. గురువారం నెల్లిమర్లలో మెప్మా సీఎంఎం గేదెల రాము ఆధ్వర్యంలో అక్షరాంధ్ర కార్యక్రమ బోధకులకు మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ టి.జైరామ్, మెప్మా సీఎంఎం గేదెల రాము, ఏఎంసీ డైరెక్టర్ ఎంఎం.నాయుడు, ఆర్పీలు, టీఎల్ఎఫ్, ఎస్ఎల్ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండశంభంలో గాయత్రీ మహా యజ్ఞం

గరివిడి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండశంభంలో గురువారం గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. గ్రామానికి చెందిన యువకులు గొర్లె చిన్నంనాయుడు కార్తీకమాసం ముగింపు పురస్కరించుకునిరామాలయం వద్ద చీపురుపల్లి ఆర్యసమాజం వారితో గాయత్రీ మహాయజ్ఞం జరిపించారు.

కుష్ఠువ్యాధి లక్షణాలను గుర్తించాలి: డీపీఎంవో

కొత్తవలస, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి వెళ్లి కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉంటే గుర్తించాలని డీపీఎంవో అప్పలస్వామి సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నిర్మూలించుకోవచ్చని చెప్పారు. గురువారం తుమ్మికాపల్లి, ముసిరాం, సీతంపేటలో కుష్ఠు వ్యాధిపై నిర్వహిస్తున్న ఇంటింటా సర్వేను వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారితో కలిసి పరిశీలించారు.

బాల్యవివాహాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

రాజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని బెజ్జిపురం వైసీబీ ఎన్‌జీవో సంఘం ప్రతినిధి డిపద్మ కోరారు. గురువారం బొద్దాంలో హెచ్ఎం గురుమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్యవివాహలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు స్వేచ్ఛగా జీవించే, రక్షణపొందే, అభివృద్ధి చెందేహక్కు ఉన్నాయని తెలిపారు.

డీఈవో మొండివైఖరి తగదు

రాజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పాఠశాలలకు సెలవు దినం ప్రకటించుకునే అధికారాన్ని హెచ్ఎంలకు ఇచ్చే విషయంలో డీఈవో మొండివైఖరి ప్రదర్శించడం తగదని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సంఘ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలిపాడ్యమి వంటి పండగలకు సెలవు ప్రకటించకపోవడంతో హెచ్ఎంలు, విద్యార్థులు ఇబ్బందులుపడతారని పేర్కొన్నారు.

సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలి

రాజాం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు కోరారు. గురువారం రాజాంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని, హెల్పర్లకు ప్రమోషన్ గైడ్‌లైన్స్ రూపొందించాలని డిమాండ్ చేశారు.

చెత్తలేకుండా చర్యలు తీసుకోవాలి: డీపీవో

గంట్యాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఎక్కడా చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శికి జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జున సూచించారు. మండలంలోని సిరిపురంలో పారిశుధ్యం పనులను గురువారం పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో ఉన్నారు.


గంట్యాడ: సిరిపురంలో సిబ్బందితో మాట్లాడుతున్న మల్లిఖార్జున

పథకాల్లో క్లోరినేషన్ చేయాలి

బొండపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రక్షితపథకాలను నిర్ణీత గడువులోగా శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని జడ్పీ సీఈవో బి.సత్యనారాయణ కోరారు. గురువారం బోడసింగిపేటలో రక్షితమంచినీటి పథకంతో పాటు చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, జి.గిరిబాల, ఈవోపీఆర్‌డీ ఎ.రఘుపతి రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈఈ అలేఖ్య, సర్పంచ్ మీసాల జానకిరాం పాల్గొన్నారు.

పెద్దల భూముల్లో చెట్లు ఎందుకు తొలగించలేదు

ఎస్.కోట రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమ భూముల్లో పెంచుకుని, జీవనాధారంగా ఉన్న చెట్లను నరికించిన జిందాల్ యాజమాన్యం,పెద్దల భూముల్లో చెట్లు ఎందుకు తొలగించలేదని నిర్వాసితులు ప్రశ్నించారు. గురువారం మండలంలోని బొడ్డవరలో జిందాల్ నిర్వాసితుల దీక్షలు 158వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల భూముల్లో ఉన్న ఒక్క చెట్టు కూడా ముట్టుకోలేదని తెలిపారు.

అనధికార లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు

● విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య


సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న నల్లనయ్య

విజయనగరం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య హెచ్చరించారు. గురువారం విజయనగరంలోని కేఎల్ పురం ప్రాంతంలో అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన లేఅవుట్ హద్దురాళ్లను ప్రణాళిక సిబ్బంది తొలగించారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న సిమ్మెంట్ పోల్స్, ఫెన్సింగ్‌ను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఅవుట్ ఏర్పాటుకు తప్పనిసరిగా ప్రణాళిక విభాగం నుంచి అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. కొందరు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ, అనధికారికంగా లేఅవుట్లు వేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు.

ప్రజల సమస్యలు గుర్తించాలి

ప్రతి రోజు సచివాలయం పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించాలని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య కోరారు. గురువారం నగరంలోని జమ్ము ప్రాంతంలో గల ఏడో నెంబరు సచివాలయంలో రికార్డులను, హాజరు పట్టీలను నల్లనయ్య పరిశీలించారు

సమయపాలన పాటించాలి

భోగాపురం, నవంబరు20(ఆంధ్రజ్యోతి):సచివాలయాల సిబ్బంది సమయ పాలన పాటించాలని ఎంపీడీవో డీడీ స్వరూపారాణి కోరారు. గురువారం మండలంలోని బైరెడ్డిపాలెం సచావాలయంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం రెడ్డికంచేరు పంచాయతీలో ప్రతిరోజూ పారిశుధ్య పనులు నిర్వహించాలని కార్యదర్శి, సిబ్బందికి సూచించారు. పోలిపల్లిలో హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీవో పరిశీలించారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

గజపతినగరం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎం.గుమడాం గ్రామానికి చెందిన గంట్యాడ అప్పలనాయుడు(54) చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు.ఎస్ఐ కథనంమేరకు.. అప్పలనాయుడు మానసికస్థితి బాగోలేకపోవడంతో రెండేళ్లుగా పిచ్చి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో మేడపైన పురుగులమందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు.పొలం నుంచి ఇంటికి వచ్చిన భార్య సత్యవతి చూడగా పురుగుల మందుసీసా ఉండడంతోచుట్టుపక్కల వారి సహాయంతో 108 వాహనంలో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు.ఈ మేరకు గురువారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

ఆంజనేయస్వామి ఆలయంలో మైక్‌సెట్ చోరీ

కొత్తవలస,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళపాలెం జంక్షన్‌లోగల ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ఉదయం యాంప్లిఫైర్‌తోపాటు మైక్‌సెట్ చోరీకి గురయ్యాయి. గురువారం ఉదయం 5.45 నిమిషాలకు స్కూటీపై వచ్చిన ముగ్గురు ఆలయంలోకి వెళ్లి యాంప్లిఫైర్‌తోపాటు మైక్‌సెట్ పట్టుకుపోయినట్లు సీసీ కెమెరాలను పరిశీలించి గుర్తించారు. ఈమేరకు సీఐ షణ్ముఖరావు దృష్టికి గ్రామపెద్దలు ఈ విషయం తీసుకెళ్లారు. నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

కుక్కల దాడిలో 12 గొర్రె పిల్లల మృతి

వంగర, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలగాంలో గురువారం కుక్కల దాడిచేయడంతో 12గొర్రెపిల్లలు మృతిచెందగా పది గాయపడ్డాయి. గ్రామానికి చెందిన పురబోతు సింహాచలం తన గొర్రె పిల్లలను ఇంటి వద్ద గల కొట్టంలో ఉంచి పొలం పనులకు వెళ్లాడు. ఇంతలో అక్కడ ఉన్న కుక్కలు కొట్టంలోకి చొరబడి గొర్రెపిల్లలపై దాడి చేశాయి. గొర్రెలు అరుపులతో అక్కడఉన్న వారు వచ్చి కుక్కలను చెదరగొట్టగా అప్పటికే 12 పిల్లలు మృతిచెందాయి. రైతు లబోదిబోమంటున్నాడు.

డ్రైవింగ్ స్కూల్ లైసెన్స్ సరెండర్

విజయనగరం క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మోటారు వాహనాల చట్టంలోని రూల్ 24 నుంచి 32లో పొందుపరిచిన ప్రకారం లేని డ్రైవింగ్ స్కూళ్లు మూసివేయనున్నట్లు రవాణాశాఖ ఉపకమిషనర్ మణికుమార్ తెలిపారు. ఇప్పటికే ఒకడ్రైవింగ్ స్కూల్ రద్దుచేశామని, మరో డ్రైవింగ్ స్కూల్ లైసెన్స్‌ని రవాణాశాఖ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు చెప్పారు. గురువారం జిల్లాలోని డ్రైవింగ్ స్కూళ్లలో రవాణాఅధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మణికుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రతలో భాగంగా ఇప్పటికే డ్రైవింగ్ స్కూళ్లకు గత ఏడాది నుంచి నోటీసులు జారీచేసినట్లు తెలిపారు. డ్రైవింగ్‌స్కూల్స్ వాహనాలు, డాక్యుమెంట్లు సరిగ్గాలేవని వచ్చిన సమాచారంతో కలెక్టరు ఆదేశాలతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

విజయనగరం క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టబడిన ఇద్దరికి గాను ఒక్కొక్కరికి ఐదు రోజులు చొప్పున జైలు శిక్ష విధిస్తూ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎంఎన్‌హెచ్ఆర్ తేజ చక్రవర్తి గురువారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి మద్యం సేవించి వాహనం నడిపి డి.ఉమాశంకరరావు, కింతలి ప్రసాదరావు పట్టుబడడంతో కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి తీర్పు వెల్లడించినట్లు చెప్పారు.

మూడురోజుల జైలు..

రాజాం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాన్ని నడిపిన వ్యక్తికి మూడురోజులు జైలుశిక్ష విధిస్తూ రాజాం జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.నైమిష గురువారం తీర్పు వెలువరించారని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు.సీఐ కథనం మేరకు.. పట్టణంలోని మల్లిఖార్జున కాలనీకి చెందిన తమ్మిరెడ్డి దుర్గాప్రసాద్ ఈనెల 18వ తేదీ రాత్రి మద్యం సేవించి వాహనం నడపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఆయనపై కేసునమోదు చేసి కోర్టులో హాజరుపరచగా మూడు రోజులు జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

కల్లేపల్లిలో ఆసుపత్రికోసం స్థల పరిశీలన

లక్కవరపుకోట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లేపల్లిలో ఆసుపత్రి నిర్మాణానికి గురువారం ఏపీ వైద్య సేవా మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఇంజనీరింగ్ అధికారి నరేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ కార్యాలయ అధికారి స్థలాన్ని పరిశీలించారు. గతంలో కేటాయించిన స్థలం అనివార్య కారణాల వల్ల రద్దయింది. దీంతో ఆసుపత్రి నిర్మాణంలో జాప్యం ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తర్వాత ఆసుపత్రి నిర్మాణం విషయంలో కదలిక వచ్చింది. రెవెన్యూ అధికారులు పరిశీలించి స్థలాన్ని అప్పగిస్తే ఆసుపత్రి పనులకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులు తయారు చేస్తారని ఇంజనీరింగ్ అధికారి హరి తెలిపారు. ప్రస్తుతం కల్లేపల్లిలో పంచాయతీ భవనంలో ఆసుపత్రి సేవలందిస్తోంది. కార్యక్రమంలో సర్పంచ్ ముసలినాయుడు,ఎంపీటీసీమాజీ సభ్యుడు జక్కాన కన్నబాబు, పీహెచ్‌సీ వైద్యులు అజయ్‌కుమార్, తేజ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిరోధంపై సైకిల్‌యాత్ర

కొత్తవలస, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):మాదక ద్రవ్యాల నిరోధంపై పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు అభ్యుదయం పేరుతో నిర్వహిస్తున్న సైకిల్ యాత్రీకులకు గురువారం కొత్తవలసలో సీఐ షణ్ముఖరావు స్వాగతం పలికారు. ఈసందర్భంగా దెందేరులోని జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు గంజాయి వాడకంపై కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కొత్తవలస వరకు ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం మండలంలో అభ్యుదయ సైకిల్‌యాత్రను నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

గోనెసంచులను అందజేయాలి: తహసీల్దార్

గజపతినగరం, నవంబరు20(ఆంధ్రజ్యోతి):మిల్లుకు ధాన్యం తీసుకువచ్చిన రైతులకు ఇబ్బందులు సృష్టిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ బి.రత్నకుమార్ హెచ్చరించారు.గురువారం గజపతినగరం దిగువవీధిలో రైతు సేవా కేంద్రంలో మిల్లర్లు, వెలుగు సిబ్బంది, పీఏసీఎస్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులకు అవసరమైన గోనె సంచులను అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

● చీపురుపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ డి.ధర్మరాజు ఆదేశించారు. గురువారం చీపురుపల్లిలో మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ నాగలక్ష్మి, ఏవో సూర్యకుమారి పాల్గొన్నారు.

ముంజేరు రణరంగం

(ఐదో పేజీ తరువాయి)

ప్రయత్నించారు. దీంతో ఇరువర్గాల మహిళల మధ్య గొడవ మొదలైంది. అంతలోనే బాహాబాహీకి దిగారు. మిగతా వారు కూడా పెద్దసంఖ్యలో మోహరించి ఒకరినొకరు నిలదీసుకున్నారు. ఈ క్రమంలో పరిస్థితి అదుపు తప్పింది. ఘర్షణ తలెత్తింది. సుమారు 45 నిమిషాల పాటు తోపులాటలు, పిడిగుద్దులు, జుట్టు పట్టుకొని ఈడ్చుకోవడాలు జరిగాయి. కొందరు కారం జల్లారు. మరోవర్గం రాళ్లు రువ్వారు. ఆ సమయంలో చాలా మంది కళ్లల్లోకి కారం, ఇసుక పడడంతో అవస్థలు పడ్డారు. అప్పటికే అక్కడకు చేరుకున్న ఎస్ఐ సూర్యకుమారి ఇరువర్గాల వారినీ వారించడానికి ఎంత ప్రయత్నించినా ఎవరూ వినలేదు. ఎస్ఐ, ఏఎస్ఐ, కానిస్టేబుల్ మాత్రమే ఉండడంతో ఎంత ప్రయత్నించినా ఇరువర్గాలూ తగ్గలేదు. ఎస్ఐ సూర్యకుమారి ముఖంపై కారం, కళ్లలో ఇసుక పడడంతో ఇబ్బంది పడ్డారు. గొడవ సమయంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోకి రాళ్లు పడడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. రాళ్లు పడి గుడ్డుకూర, సాంబరు పాడైంది. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.నాగేశ్వరావు సమీప హైస్కూల్ నుంచి కూరను తీసుకొచ్చి విద్యార్థులకు అందించారు. కొద్దిసేపటి తర్వాత ముంజేరు గ్రామస్థులందరూ వచ్చి కాలనీ వాసులను లాగి మురుగుకాలువ తవ్వకాలు కొనసాగించారు. అనంతరం సిద్దార్థకాలనీ మహిళలు విజయనగరం వెళ్లి ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు గోడు వినిపించారు. విషయం తెలుసుకొన్న విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీఐ దుర్గా ప్రసాదరావు సంఘటనా స్థలానికి చేరుకొని ఈవోపీఆర్డీవో గాయిత్రి, కార్యదర్శి రమణమ్మను విషయం అడిగి తెలుసుకొన్నారు. ఉద్రిక్తతలో ముంజేరు గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు తమ బంగారు గొలుసులు పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని మండల అధికారులు

ముంజేరు పంచాయతీ సిద్దార్థకాలనీలో మురుగుకాలువ సమస్యపై తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంటే మండల స్థాయి అధికారులు రాలేదు. తగినంత మంది పోలీసులను ఏర్పాటు చేయకపోవడంతోనే పరిస్థితి చేయిదాటిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

సిద్దార్థకాలనీకి చెందిన బోనెల గాయిత్రి, మరికొందరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 18 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ కె.దుర్గాప్రసాదరావు గురువారం తెలిపారు. మురుగుకాలువ తవ్వకాన్ని అడ్డుకుంటున్న సమయంలో కొంతమంది వచ్చి దుర్భాషలాడడంతో పాటు కొట్టారని, దుస్తులు చించేసి దౌర్జన్యం చేశారని ఫిర్యాదు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

దౌర్జన్యం చేశారంటూ ఫిర్యాదు

సిద్దార్థకాలనీకి చెందిన 11 మంది దౌర్జన్యం చేశారని ముంజేరు గ్రామానికి చెందిన ఎం.వాణి, మరి కొందరు ఫిర్యాదు చేసినట్లు సీఐ కె.దుర్గాప్రసాదరావు గురువారం తెలిపారు. తమ దుస్తులు చింపేసి దుర్భాషలాడారని, జుత్తు పట్టుకొని కొట్టారని, రక్తం వచ్చినట్టు గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ చెప్పారు.

బోగస్ ఓట్లకు చెక్

(ఐదో పేజీ తరువాయి)

జాబితాను జనవరిలో విడుదల చేసేవారు. ఈ ఏడాది ఎస్ఎస్ఆర్ షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేయలేదు. తొలుత 2002 జాబితాలో ఉన్న ఓటర్లు, తాజా జాబితాలో ఉన్న ఓటర్లతో సరిపోల్చుతూ మ్యాపింగ్ చేపట్టింది. అప్పట్లో కుటుంబ పెద్దలకు ఓటు హక్కు ఉండి పిల్లలకు లేకుండా ఉంటే ఇప్పుడు అదనంగా ఉన్న వారి వివరాలు నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ వల్ల మరణించిన వారి వివరాలతో పాటు వలస వెళ్లిన వారి గురించి కూడా తెలుస్తుంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో వలస వెళ్లినా, మరణించినా ఖచ్చితమైన వివరాలు వెల్లడికానున్నాయి. పట్టణ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో సమాచారం రావడం కష్టమని బీఎల్‌వోలు చెబుతున్నారు. ఇప్పటివరకూ జిల్లా వ్యాప్తంగా 34 శాతం మ్యాపింగ్ ప్రక్రియ జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మ్యాపింగ్‌తో బోగస్ ఓటర్ల జాబితా బయటపడనుంది.

● జిల్లాలో 2002 ఓటర్ల జాబితా ప్రకారం 13,13,469 మంది ఓటర్లు ఉన్నారు. అప్పటిలో రాజాంలో 2,03420 ఓటర్లు, బొబ్బిలిలో 2,01037, చీపురుపల్లిలో 1,70,748, గజపతినగరంలో 1,86,901 మంది, నెల్లిమర్లలో 1,69,586 మంది, విజయనగరంలో 1,84,756, ఎస్.కోటలో 1,97,021 ఓటర్లు ఉన్నారు. 2025లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 15,72,237 మంది ఓటర్లు ఉన్నారు. రాజాంలో 2,28,958, బొబ్బిలిలో 2,32,664 , చీపురుపల్లిలో 2,06,461, గజపతినగరంలో 2,06,335, నెల్లిమర్ల 2,14,378, విజయనగరంలో 2,59,807, ఎస్.కోట 2,23,634 ఓటర్లు ఉన్నారు.

ఇతర వర్గాలతో సమానంగా ఎదగాలి

(ఐదో పేజీ తరువాయి)

అమలు చేయాలని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను స్వయంగా గమనించాలని సూచించారు. ఆర్డీవో, డీఎస్పీ స్థాయి అధికారులు ఎస్సీ బాలురు వసతిగృహాలను తరచూ తనిఖీ చేయాలన్నారు. అనంతరం కమిషన్ కార్యదర్శి చిన రాముడు మాట్లాడుతూ దళితుల నుంచి వచ్చే ఫిర్యాదుల్లో ఎక్కువ శాతం భూములకు సంబంధించినవే వస్తున్నాయని చెప్పారు. ఆ సమస్యలకు త్వరగా పరిష్కారం చూపాలని, లేని పక్షంలో కారణాలు సవివరంగా తెలియజేసి మార్గం చూపాలన్నారు. దీనిపై కలెక్టర్ రామసుందర్‌రెడ్డి స్పందిస్తూ 15 రోజుల్లో తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ జిల్లాలో అట్రాసిటీ కేసుల విషయంలో ప్రత్యేక దృష్టి పెడతామని, బాధితులకు న్యాయం అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, ఏఎస్పీ సౌమ్యలత, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అన్నపూర్ణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావులు ఉన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట

● ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్

రామభద్రపురం, నవంబరు20(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ అన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, భోజనశాలతో పాటు విద్యార్థులు చదువుతున్న గదులను ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెడుతున్నారా లేదా? రుచికరంగా ఉందా లేదా అని ఆరా తీశారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులకు, వసతిగృహానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట ఎస్సీ కమిషన్ రాష్ట్ర కార్యదర్శి చిన్నరాముడు, సోషల్ వెల్ఫేర్ డీడీ అన్నపూర్ణ ఉన్నారు.


వసతి గృహాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ జవహర్

పేదల సొంతింటి కలను నెరవేర్చండి

బొబ్బిలి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): పేదలకు సొంతింటి కలను నెరవేర్చండని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని రామన్నదొరవలసలో టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను, వైసీపీ హయాంలో నిర్మించిన జగనన్న కాలనీని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస సదుపాయాలు కల్పించకుండా పట్టాలు, ఇళ్లు ఇచ్చేశాం కట్టేయండి అని లబ్దిదారులపై అప్పట్లో ఒత్తిడి చేశారన్నారు. పదేళ్లు కావస్తున్నా రోడ్లు, డ్రైయిన్లు, వీధి దీపాలు, తాగునీరు సమకూర్చకపోవడం సిగ్గుచేటన్నారు. టీడీపీ హయాంలో ఇళ్ల కోసం డిపాజిట్లు కట్టిన వారికి సొమ్ము వాపసు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సమస్యలకు తెరపడుతుందని ఆశించినా అది జరగలేదన్నారు. డబ్బులు వాపసు చేయాలని నాయకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా పేదల సొంతింటి కలను నిజం చేసి నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పొడుగు అశోక్, సూర్యనారాయణ పాల్గొన్నారు.


ఇళ్ల ఎదుట సీపీఐ నాయకులు

ఘనంగా వారోత్సవాల ముగింపు

బొబ్బిలి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ స్వర్ణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూటీఎఫ్ నేత కె.విజయగౌరి హాజరై మాట్లాడారు. సమాజంలో చైతన్యం, అవగాహన పెరగాలంటే గ్రంథాలయాలు అభివృద్ధి చెందాలన్నారు. నేటి ఆధునిక యువత మొబైల్‌ఫోన్లకు, ఇతరత్రా అవాంఛనీయ దురలవాట్లకు బానిసలై బంగారు జీవితాలను నాశనం చేసుకోవడం దురదృష్టకరమన్నారు. నిరంతరం చదవడం అనే అలవాటు కొనసాగిం చిన వారికి ఉజ్వల భవిష్యత్ ఖాయమన్నారు. అనంతరం పలు పోటీలలో విజేతలకు నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదా నం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మి, చంటి ఉన్నారు.


బొబ్బిలిలో మాట్లాడుతున్న విజయగౌరి

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

● బాడంగి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు రౌతు రామ్మూర్తి నాయుడు, బాడంగి సర్పంచ్ కండి రమేశ్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. లైబ్రేరియన్ దుర్గాప్రసాద్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వై.రవిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత స్థానాలను అధిరోహించాలంటే గ్రంథాలయాల బాటపట్టా లన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, ఎంఈవో రాజేశ్వరి, హెచ్ఎం దత్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

● రామభద్రపురం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని ఎంఈవో తిరుమలప్రసాదరావు కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమన్నారు. కార్యక్రమంలో ఎంపీ పాఠశాల హెచ్ఎం రత్నాకర్, పూడివీధి స్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, శాఖా గ్రంథాలయాధికారి బి.సత్యవాణి పాల్గొన్నారు.

మత్స్య సంపద ఆశాజనకం

(ఐదో పేజీ తరువాయి)

కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ ఏడాది కూడా జిల్లా కేంద్రంలో సభ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాలు తీరంలో ఉన్నాయి. జిల్లాలో 28 కిలోమీటర్లు పొడవునా తీర ప్రాంతం ఉంది. మొత్తం 19 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. వాటిల్లో 13,375 మంది జనాభా ఉండగా 4048 మంది వేటకు వెళ్తారు. వారికి 858 పడవులు ఉన్నాయి. వీరు కాకుండా ఇన్‌లాండ్‌లో 17,531 మంది మత్స్యకారులు ఉన్నారు. మత్స్య శాఖ పరిధిలో 196 చెరువులు ఉండగా, పంచాయతీ పరిధిలో 5679 చెరువులు ఉన్నాయి. ప్రధానంగా సముద్రంలో సొర, చందువ, గోరింకలు, కనాగడతలు, రొయ్యలు, తిమ్మిరి, వంజరం, గులువిందలు, నత్తలు, పీతలు, సురా, వనమట్టాలు, సాల్మన్ మగాలు, పారా వంటి రకాల చేపలు లభ్యమవుతాయి. చెరువుల్లో అయితే బొచ్చులు, రాంగండిలు, సవడ్లు, ఎర్రమైళ్ళు, బొబ్బిడాలు, గిడుసులు, జెల్లలు, చందువాలు, రొయ్యలు వంటి రకాలు లభిస్తున్నాయి. జిల్లాలో ఉత్పత్తి అవుతున్న చేపలు జిల్లా ప్రజలు వినియోగానికి మాత్రమే సరిపడుతున్నాయి. ఎండు చేపలను ఒడిశాకు పంపిస్తున్నారు. మాంసం ప్రియులు ఇటీవల కాలంలో ఎక్కువగా చేపలనే వినియోగించడంతో వీటికి డిమాండ్ పెరిగింది.

రైతులకు సహకరించండి

బొబ్బిలి రూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు సమయంలో మిల్లర్లు రైతులకు సహకరించాలని తహసీల్దార్ ఎం.శ్రీను కోరారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో రైస్ మిల్లర్లతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు ఎటువంటి ఇబ్బందులు కలగనీయరాదన్నారు. కొనుగోలు సాఫీగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. తేమ శాతంలో తేడాలు రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి రావల్సిన బకాయలు, బ్యాంక్ గ్యారంటీ, టెస్ట్ మిల్లింగ్, బియ్యం అందించే గడువు పెంచాలని ఈ సందర్భంగా తహసీల్దరును రైస్ మిల్లర్లు కోరారు. కార్యక్రమంలో సీఎస్ డీటీ రెడ్డి సాయికృష్ణ, ఏవో మజ్జి శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.


మిల్లర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీను

పర్యావరణ స్థిరత్వం-పరిశుభ్రతపై శిక్షణ

బొబ్బిలి రూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్వయం సహాయక బృందాలకు థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ పర్యావరణ స్థిరత్వం, పరిశు భ్రత, పచ్చదనంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో రవికుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు, ఏవో డి.వి.అప్పారావు, ఏపీఎం భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కోమటిపల్లి విద్యార్థులు

బొబ్బిలి రూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కోటిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు లంక శరణ్య, లంక జాహ్నవి ఎంపికయ్యారు. జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలో భాగంగా బుధవారం బొబ్బిలి సంస్థానం ఉన్నత పాఠశాలలో నిర్వహిం చిన యోగా అండర్-14, 17 విభాగం పోటీల్లో వారు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో సాధించారు. ఈ నెల 22వ తేదీన బాపట్లలో జరగనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్ఎం శంబంగి రామమోహనరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను హెచ్ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయిని ఎం.రాజేశ్వరి అభినందించారు.


విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

ఎన్జీవోలు సభ్యత్వం తీసుకోవాలి

బొబ్బిలి రూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో ఎన్నికల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఎన్జీవో సభ్యత్వం తీసుకోవాలని బొబ్బిలి యూనిట్ ట్రెజరర్ చుక్క శ్రీనివాసరావు కోరారు. గురువారం అలజంగి, కారాడ సచివాలయాలకు వెళ్లి సభ్యత్వం నమోదు చేశారు. కార్యక్రమంలో బొబ్బిలి యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాసనాయుడు, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

రామభద్రపురం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని మండల ప్రత్యేక అధికారి జి.ప్రశాంత్ కుమార్ అన్నారు. గురువారం రొంపల్లి సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులంతా నిర్ణీత సమయానికి హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజురఫీ జాన్, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు పాల్గొన్నారు.

పీఎఫ్ బకాయిలను విడుదల చేయండి

బొబ్బిలి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలకు ఆరునెలలుగా పెండింగ్‌లోని పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు జేసీ రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ అవసరాల కోసం దాచుకున్న డబ్బులు సకాలంలో అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో మండల శాఖ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఏపీటీఎఫ్ నాయకులు చిన్నారావు, జీసీహెచ్‌జీ శర్మ, కృష్ణమోహన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనంలో హాస్టల్

(ఐదో పేజీ తరువాయి)

చేయలేదు. ఆయా, మేట్రిన్ మాత్రమే ఉంటున్నారు. హాస్టల్ పరిస్థితిని ఐసీడీఎస్ పీడీ విమలారాణి వద్ద ప్రస్తావించగా కళాశాల బాలికల వసతిగృహం శిథిలావస్థకు చేరుకోవడం వాస్తవమేనని, అయితే భవనం మార్పుపై దృష్టి సారించామన్నారు. సిబ్బంది కొరత కూడా అధికంగానే ఉందని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉందని స్పష్టం చేశారు. సిబ్బంది సరిగా విధులకు రాకపోవడంపై పరిశీలిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయి వ్రతాలు

బొబ్బిలి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పూల్‌బాగ్ సత్యసాయి మందిరంలో మహిళలు సాయి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్యసాయిసేవాసమితి కన్వీనర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సాయంత్రం వేద పఠనం, భజనలు చేశారు. అనంతరం సబ్‌ట్రెజరీ అధికారి పీవీ పద్మనాభం మాట్లాడారు. ప్రతీ మనిషిలో ఆధ్యాత్మిక భావజాలం ఉంటే సున్నితత్వం అలవడుతుందన్నారు. తద్వారా భగవాన్ బోధించిన ప్రేమ, సేవాతత్పరత, దయ, భక్తిభావం పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో సాయిభక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


మందిరంలో సాయివ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

డ్రంకెన్ డ్రైవ్ కేసులో రూ.10 వేల జరిమానా

రామభద్రపురం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడిపిన సాలూరు పట్టణంలోని గాడివీధికి చెందిన అయ్యల సోమయాజుల అజయ్‌కుమార్‌కు సాలూరు కోర్టు రూ.10 వేల జరిమానా విధించిందని ఎస్ఐ వెలమల ప్రసాదరావు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అలాగే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ సూచించారు.

బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు

బొబ్బిలి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని బలిజిపేట రోడ్డు వేణుగోపాలస్వామి కోవెల సెంటర్‌లో గురువారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దాంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో బాడంగి మండలం కోటిపల్లికి చెందిన హరి, స్థానిక ప్రైవేట్ పాఠశాల విద్యార్థి చరణ్‌తేజ గాయాలపాలయ్యారు. వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ హరిని మెరుగైన చికిత్స కోసం విజయనగరం ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ ఘటనపై హెచ్‌సీ టి.కాశీరావు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బొబ్బిలి రూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): కోమటిపల్లి శివారు మలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. కింతలివానిపేటకు చెందిన జి.గోవిందరావు ద్విచక్ర వాహనంపై చిలకలపల్లి వెళ్తూ కోమటిపల్లి సమీపంలోని మలుపులో ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. విషయం గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని బొబ్బిలి సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గోవిందరావును విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉపాధి పనుల పరిశీలన

బొబ్బిలి రూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): జె.రంగరాయపురం సమీపంలో తుమ్మలవాని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో పిరవికుమార్, ఏపీవో లక్ష్మీపతిరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులకు వేతనదారులు చేపట్టి గిట్టుబాటు వేతన పొందాలన్నారు. మాస్టర్ల నమోదులో జాగ్రత్త వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఫైర్ సెక్యూరిటీ సర్వీస్ సేవలు విస్తృతం

● ఐఎఫ్ఎస్‌సీ ఫౌండర్ శ్రీను మహంతి

విజయనగరం క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఐఎఫ్ఎస్‌సీ సంస్థ ఆధ్వర్యంలో ఫైర్ సెక్యూరిటీ సర్వీసులను మరింత విస్తృతం చేస్తామని ఐఎఫ్ఎస్‌సీ ఫౌండర్ శ్రీను మహంతి తెలిపారు. గురువారం విజయనగరంలోని ఐఎఫ్ఎస్‌సీ కార్యాలయంలో ఫైర్ సెక్యూరిటీ సర్వీసెస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పరిశ్రమలు, పెద్ద పెద్ద వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లల్లో జరిగే ప్రమాదాలు, సెక్యూరిటీ లోపాలను సరిచేసేందుకు, ప్రమాదాల బారి నుంచి ఆస్తులను కాపాడేందుకు ఫైర్ సేఫ్టీ, సెక్యూరిటీ సర్వీసెస్‌ను తమ సంస్థ ద్వారా సేవలందిస్తామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా సేవలందిస్తామని తెలిపారు. ఫైర్ సేఫ్టీలో సుమారు 15 ఏళ్ల అనుభవంతో తమ సంస్థ అధునాతన విధానాలతో సెక్యూరిటీ సర్వీసులో అడుగుపెట్టినట్టు తెలిపారు.


మాట్లాడుతున్న శ్రీను మహంతి